క్లుప్తంగా

అర్హులందరికీ 'సంక్షేమ ఫలాలు'


మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించేలా చర్యలు చేపడుతున్నామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా నూతన రేషన్ కార్డు లబ్ధిదారుల సర్వేపై సోమవారం హిమాయత్‌సాగర్‌లోని కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ సర్వే నియమ నిబంధనలను వార్డు ఆఫీసర్లకు వివరించారు. మేనేజర్ ఇ.మంజులత, డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, సూపర్‌వైజర్లు, వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రజావాణి' ఫిర్యాదులపై సత్వర చర్యలు

రాజేంద్రనగర్: వివిధ సమస్యలపై ప్రజావాణి కార్యక్రమంలో అందిన ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు స్వయంగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటున్నారని జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవి కుమార్ వెల్లడించారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్వయంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం ఆయన విలేకరుతో మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొంటున్నారని తెలిపారు. సంబంధిత ఫిర్యాదును అందజేసి అక్కడే పరిష్కరించుకునేందుకు మంచి అవకాశం ఉందన్నారు. సోమవారం అందిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు అందజేశామన్నారు. స్వయంగా అధికారులే ఫిర్యాదుదారుని వద్దకు వెళ్లి సంబంధిత సమస్యను పరిష్కారం కోసం కృషి చేస్తారని తెలిపారు.

రేషన్ కార్డుదారుల దరఖాస్తుల పరిశీలన పూర్తి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో రేషన్ కార్డుదారుల దరఖాస్తుల పరిశీలన సోమవారం పూర్తయిందని ఉప కమిషనర్ రవి కుమార్ తెలిపారు. రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్, శాస్త్రీపురం, అత్తాపూర్ డివిజన్ల పరిధిలో మొత్తం 7 వేల దరఖాస్తులను పరిశీలించినట్టు వెల్లడించారు. తన కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... దరఖాస్తు పరిశీలనకు 25 మంది సిబ్బందిని నియమించామన్నారు. సిబ్బంది దరఖాస్తుదారిని ఇంటి వద్దకు వెళ్లి పూర్తి వివరాలను పరిశీలించినట్లు తెలిపారు. రోజువారీగా దరఖాస్తుల పరిశీలన డాటాను అందజేశామన్నారు. 7 వేల దరఖాస్తులకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రస్తుతం కంప్యూటర్‌లో పొందు పరిచామన్నారు.

విద్యా వికాసానికి పరిశోధన కీలకం

చార్మినార్: విద్యా వికాసానికి పరిశోధన కీలకమని కేరళ సెంట్రల్ యూనివర్సిటీ సహాయాచార్యులు డాక్టర్ రామకృష్ణ బండారు అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాలలో పరిశోధన ఆవశ్యకత, మార్గదర్శకాలు, విశ్లేషణాత్మక పద్ధతులపై ఒకరోజు వర్క్‌షాప్‌ను కామర్స్ మేనేజ్మెంట్ విభాగం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కేరళలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డా.రామకృష్ణ బండారు ప్రధాన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పరిశోధన విద్యా వికాసానికి ఎంతో కీలకమని పేర్కొంటూ ప్రేరణాత్మకంగా, ఆలోచనాత్మకంగా ఉంటుందన్నారు. ఈ వర్క్‌షాప్‌లో పరిశోధన విధానాలు, డేటా సేకరణ, విశ్లేషణ పద్ధతులు, నివేదిక తయారీ, నైపుణ్యాల పెంపు తదితర అంశాలపై ఆయన వివరించారు. డా.రూన్సీ రాణి సమన్వయం చేసిన ఈ కార్యక్రమంలో విభాగ అధ్యక్షుడు డా.మల్లికార్జునరావు, ఇఫత్ ఉన్నీసా, లలిత, డా.రవీంద్ర బాబు, డా.వి.శిరిష, భార్గవి, రాజేష్, సత్యనారాయణ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

ముద్గర్ పోటీ విజేత సమీర్‌ఖాన్



గోల్కొండ: ముద్గర్, రెజ్లింగ్ పోటీల్లో గోల్కొండ నయాకీలాకు చెందిన ముహ్మద్ సమీర్‌ఖాన్ తన సత్తాచాటారు. ముద్గర్ అఖాడా వారు నిర్వహించిన ముద్గర్ మల్లన్న చాంపియన్‌షిప్ పోటీల్లో మహ్మద్ సమీర్‌ఖాన్ 511వ సార్లు ముద్గర్‌ను తిపి విజేతగా నిలిచారు. స్థానిక మజ్లిస్ ఏరియా కమిటీ నాయకుడు సిరాజ్ పట్టీదార్ ఈ సందర్భంగా మహ్మద్ సమీర్‌ఖాన్‌ను పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మిర్జా ఎక్బాల్ అహ్మద్, మహమూద్ ఖాన్, మహ్మద్ సమీర్ తదితరులున్నారు.

భౌభౌలు.. గుండె గుభేలు!

- బండ్లగూడ జాగీర్ పరిధిలో ప్రజలను బెంబేలెత్తిస్తున్న వీధి కుక్కలు
- కుక్కల బెడదపై సర్వత్రా ఆందోళన
- పార్కు చేసిన కార్లు, ద్విచక్ర వాహనాల పైకి ఎక్కి హంగామా
- ఇళ్లపైకి ఎక్కి యజమానులను భయపెడుతున్న శునకాలు


రోడ్డుపై వెళ్లే వారిపై దాడులకు తెగబడుతున్న కుక్కలు ఇవే...

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీలలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ అధికం అవుతోంది. పలు కాలనీలలో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలకు బెంబేలెత్తిస్తున్నాయి. కుక్కల సంతతి కూడా చాలా పెరిగింది. పాదచారులు, వాహనదారులపై కుక్కలు దాడులు చేస్తున్నాయి. దీంతో వారు కిందపడి గాయాలపాలై ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు.


కాలనీలలో గుంపుగా తిరుగుతున్న కుక్కలు

కార్పొరేషన్ పరిధిలో 4400 వీధి కుక్కలు..

కిస్మత్‌పూర్, దర్గా ఖలీజ్ ఖాన్, హిమాయత్‌సాగర్, హైదర్‌షాకోట్, బండ్లగూడ జాగీర్, పీరంచెరువు, గంధంగూడ, బైరాగి గూడ తదితర ప్రాంతాల్లో కలిపి ప్రస్తుతం 4400లకుపైగా వీధి కుక్కలు ఉన్నట్లు అంచనా. జీహెచ్‌ఎంసీ పరిధి నుంచి కుక్కలను తెచ్చి నగర శివారుల్లో వదిలేయడంతో పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది.

గుంపులు గుంపులుగా...

కాలనీలలోని ఏ రోడ్డులో చూసినా వీధి కుక్కలు గుంపులు గుంపులుగా దర్శనమిస్తున్నాయి. పాఠశాలలకు వెళ్లే చిన్నారులు వీటి వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి పూట ద్విచక్ర వాహనదారుల వెంటపడి మరీ దాడి చేస్తూ ఆందోళనకు గురిచేస్తున్నాయి. పట్టపగలు జన సంచారం ఉన్న ప్రాంతాల్లో మీద పడి కరుస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. కొన్ని కాలనీలలో వీధి దీపాలు సరిగా లేకపోవడంతో కుక్కలు గుంపులు గుంపులుగా సేద తీరుతున్నాయి. చిన్నారులు కన్పిస్తే చాలు ఎగబడుతున్నాయి. గతంలో చాలా సార్లు చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేయడంతో ఆస్పత్రిపాలయ్యారు.


పార్కు చేసిన కారుపైకి ఎక్కిన కుక్క


ఇంటిపైకి ఎక్కిన వీధి కుక్క

పార్కు చేసిన కార్లపైకి.. ఇళ్లపైకి...

కార్పొరేషన్ పరిధిలో ఎక్కువ మంది తమ కార్లు ఇళ్లలో పార్కు చేసుకునే సదుపాయం లేక రోడ్లపై పార్కు చేస్తున్నారు. పార్కు చేసిన కార్లపైకి వీధి కుక్కలు ఎక్కి గుంతలు వేసి తీరిగ్గా నిద్రిస్తున్నాయి. ఈ క్రమంలో వాటి కాలి గోళ్లతో గీతలు పడుతున్నాయి. ద్విచక్ర వాహనాల సీట్ల కవర్లను సైతం నోటితో పీకేస్తున్నాయి. ఇళ్లపైకి ఎక్కి చెత్తాచెదారాలను పారబోస్తున్నాయి.

3700 కుక్కలకు కుటుంబ నియంత్రణ..

కార్పొరేషన్ పరిధిలో ప్రస్తుతం 4400 కుక్కలు ఉన్నట్టుగా అంచనా. వీధి కుక్కల సంతతిని తగ్గించేందుకు మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో ప్రత్యేకంగా నిధులు కేటాయించి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసేందుకు బ్లూక్రాస్ సంస్థతో అవగాహన ఒప్పందం చేసుకొని ఇప్పటి వరకు 3700 కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేపట్టారు. ఒక్కో శునకానికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసేందుకు రూ. 1,200, ఇతర అవసరాల కోసం రూ. 400 వరకు వెచ్చించి మొత్తం రూ.1600 ఖర్చు చేసి 3700 శునకాలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించారు. వీటికి మొత్తం రూ. 59.20 లక్షలు ఖర్చు చేశారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకొని వీధి కుక్కల బారి నుంచి తమను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

గతంలో ప్రత్యేక షెడ్డు...

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనే వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయాలని అధికారులు గతంలో భావించారు. ఇందుకోసం ప్రత్యేకంగా షెడ్డు కూడా నిర్మించాలని భావించారు. అక్కడ షెడ్డు నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్ ఒకరు అడ్డు చెప్పడంతో అధికారులు మిన్నకుండిపోవాల్సి వచ్చిందనే ప్రచారం జరుగుతోంది. సమీపంలోని మరో మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించాల్సిన పరిస్థితి నెలకొంది.

శరవేగంగా శంషాబాద్ అభివృద్ధి

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని రూ. 5 కోట్లతో చేపట్టనున్న 50 పడక ఆస్పత్రి, రూ. 2.6 కోట్ల వ్యయంతో ఔటర్ డోర్ స్టేడియం పనులకు శంకుస్థాపనలు చేశారు. దీంతో పాటు పూర్తయిన పలు అభివృద్ధి పనులు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత ఐదేళ్లలో మున్సిపాలిటీలో రూ. వంద కోట్లకు పైగా నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. ప్రభుత్వం ఇటీవలే స్టాంపు డ్యూటీ నిధులతో పాటు ప్రత్యేక నిధులు సైతం విడుదల చేసి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరిస్తోందన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ సుష్మ, వైస్ చైర్మన్ బండిగోపాల్ యాదవ్, కౌన్సిలర్లు వై.కుమార్, సంజయ్ యాదవ్, అజయ్, ప్రవీణ్‌గౌడ్,రేఖ, భారతమ్మ, పుష్పలత, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రేపు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ


శంకర్ రాథోడ్, ఎంఈఓ, రాజేంద్రనగర్

అత్తాపూర్: ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు రాజేంద్రనగర్ మండల విద్యాశాఖాధికారి శంకర్ రాథోడ్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు వివరించేందుకు విద్యాశాఖ ఆదేశానుసారం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. పాఠశాలలకు వచ్చే విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలను అనుసరించి ప్రయాణించాల్సి వస్తుందన్నారు. ట్రాఫిక్ పోలీసులు సూచించిన సిగ్నల్స్ ఆధారంగా రోడ్లపై ప్రయాణించాలన్నారు. ర్యాలీ శివరాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఆరాంఘర్ చౌరస్తా వరకు కొనసాగి తిరిగి పాఠశాలకు చేరుకుంటుందన్నారు. రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్ నేతృత్వంలో అవగాహన కార్యక్రమం చేపడతామన్నారు. ర్యాలీ ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. రాజేంద్రనగర్ మున్సిపల్ కమిషనర్ రవికుమార్, తహసీల్దార్, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

మైలార్‌దేవ్‌పల్లి: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని బీఆర్‌ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ కన్వీనర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను సోమవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మదగని బాలకృష్ణ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... సంఘంలో ఉన్న ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో ఐక్యమత్యంగా ఉండి తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. విద్యార్థులకు ఉత్తమ విద్యాబుద్ధులు నేర్పించి వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రధాన కార్యదర్శి గుంజరి బాలకృష్ణ, మండల మహిళా కన్వీనర్ ముద్దం విజయమ్మ, మండల ఉపాధ్యక్షురాలు బి.నాగరాణి, మండల కోశాధికారి ఆవుల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వార్డు సభలు


మణికొండ మర్రిచెట్టు కమ్యూనిటీ హాల్‌లో వార్డు సభ ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్

మణికొండ: ఇప్పటివరకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ గృహాలకు దరఖాస్తులు చేయని వారు మంగళవారం నుంచి నిర్వహించనున్న వార్డు సభలలో దరఖాస్తులు చేయవచ్చని మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల కమిషనర్లు డి.ప్రదీప్‌కుమార్, టి.కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నుంచి గురువారం వరకు వార్డుల వారీగా సభలను నిర్వహిస్తున్నామన్నారు. వాటిల్లో ప్రజాప్రతినిధులు, పలు శాఖల అధికారులు పాల్గొంటారన్నారు. కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వైస్ చైర్మన్, చైర్మన్లు రేషన్ కార్డులు, ఇందిరమ్మ గృహాలకు దరఖాస్తులు చేయని వారిని ఈ సభలో ఇవ్వాలని సూచించారు.

శంషాబాద్ పరిధిలో...

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీలో రేషన్ కార్డుల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా తొలిరోజు నిర్వహించనున్న వార్డు సభల వివరాలను మున్సిపల్ కమిషనర్ సుమన్ వెల్లడించారు. పెద్దగోల్కొండ, రషీద్‌గూడ, ఘన్సిమియాగూడ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో, సిద్ధాంతి హరిజన సంఘం భవనం, సాతంరాయి వార్డు కార్యాలయం, మక్తాలోని మైనార్టీ కమ్యూనిటీ కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు. మోహిన్ మహల్లాలోని అంగన్‌వాడీ కేంద్రం, తొండుపల్లి మున్సిపల్ కార్యాలయం, ఊట్‌పల్లి హనుమాన్ మందిరం వద్ద అంగన్‌వాడీ కేంద్రం, సిద్ధాంతి ముదిరాజ్ భవనం, వీకర్ సెక్షన్ కాలనీలో రెండు వేర్వేరు అంగన్‌వాడీ కేంద్రాల్లో వార్డు సభలను నిర్వహించనున్నారు.

రెడ్డి సంక్షేమ పొదుపు సంఘం కార్యవర్గం


నూతన కార్యవర్గ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ టీఎన్‌జీవోస్ కాలనీ, మధుబన్ కాలనీ, పద్మశాలీపురం రెడ్డి సంక్షేమ పొదుపు సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సోమవారం టీఎన్‌జీవోస్ కాలనీలోని సంఘం కార్యాలయంలో కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. రెడ్డి సంక్షేమ పొదుపు సంఘం అధ్యక్షుడిగా సి.బుచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆర్.భూపతిరెడ్డి, కోశాధికారిగా ఎం.నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షులుగా కె.రాజవర్ధన్‌రెడ్డి, ఎల్.వెంకటేశ్వర్‌రెడ్డి, ఇ.పాండురంగారెడ్డి, బి.గోవర్ధన్‌రెడ్డి, ఎం.కృష్ణారెడ్డి, ప్రచార కార్యదర్శిగా సి.రామకృష్ణారెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా ఎ.సుఖేందర్‌రెడ్డి, సలహాదారులుగా ఎ.మీనారెడ్డిలు నియమితులయ్యారు. ఈ సందర్భంగా రెడ్డి సంక్షేమ పొదుపు సంఘం అధ్యక్షుడు సి.బుచ్చిరెడ్డి మాట్లాడుతూ... సంఘంలోని ప్రతి సభ్యుడు బాధ్యతాయుతంగా పొదుపు చేసి కుల బంధువులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. సమాజ హితం కోసం పాటుపడే రెడ్డి బంధువులు సంఘం అభ్యున్నతి కోసం కృషి చేయాలన్నారు.

తాగునీటి వృథా పట్టదా?


రోడ్డుపై ప్రవహిస్తున్న మంచినీరు


కాటేదాన్ ఆటో స్టాండ్ ప్రాంతంలో పైప్‌లైన్ పగిలి లీకవుతున్న నీరు

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజల దాహార్తిని తీర్చేందుకు నీరు వదలమంటే ఎక్కడ లేని రూల్స్ గుర్తుకు వచ్చే జలమండలి అధికారులకు నీటి వృథాని అరికట్టడంలో మాత్రం ఎలాంటి శ్రద్ధ లేకపోతున్నది. గడచిన వారం రోజులుగా రోడ్లపై మంచినీటి పైప్‌లైన్‌లు పగిలి నీరు వృథాగా పోతున్నా తమకేమీ పట్టన్నట్లు వ్యవహరిస్తున్న తీరును చూసి స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్‌లోని బస్తీల్లో ఇప్పటికే అనేక చోట్ల మంచినీటి పైప్‌లైన్‌లు పగిలి మంచినీరు రోడ్లపై వృథాగా ప్రవహిస్తున్నాయి. వీటిని నివారించాలని అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసిన ఏ ఒక్కరూ స్పందించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కాటేదాన్ ఆటో స్టాండ్ సమీపంలో పగిలిన మంచినీటి పైప్‌లైన్ కారణంగా నీరు కిలోమీటర్ మేర ఏరులై పారుతోంది. దీంతో రోడ్లన్నీ జలమయంగా మారిపోయాయి. వారం రోజులుగా పరిస్థితి ఇలాగే ఉంది. అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లిన తమ పని కానట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు వెల్లడిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. యూనివర్సిటీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని గోల్డెన్ సిటీ, డైమండ్ సిటీ, బెస్ట్ ప్రైజ్, ఖాద్రీ హిల్స్, శ్రీదేవి కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. హసన్‌నగర్, సులేమాన్‌నగర్ ఫీడర్‌ల పరిధిలోని హసన్‌నగర్, బాబానగర్, ఇంద్రానగర్, ఎన్టీఆర్‌నగర్, సులేమాన్‌నగర్, ఖాజా హోటల్, డైమండ్ సిటీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వివరించారు.

కిస్మత్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో...

బండ్లగూడ: కిస్మత్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లల్లో మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ఎ.మల్లేష్‌రాజ్ తెలిపారు. రాక్‌చర్చి ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శ్రీ సాయి కాలనీ, గవర్నమెంట్ స్కూల్, రాఘవేంద్ర కాలనీ, ఫైన్ ఆర్ట్స్ కాలనీ, ఎన్ఆర్ఐ టౌన్‌షిప్, రాధా రియాల్టీ, వివేకానంద కాలనీ, యాదాద్రి కాలనీ, ఓంనగర్ కాలనీ, ఎస్ఎం ఎన్‌క్లేవ్ 1, 2, సీఎల్ విల్లాస్, పూజా విల్లాస్, రాక్ చర్చి, కీర్తి విల్లాస్ పరిధిలో విద్యుత్ ఉండదన్నారు. అలాగే డాన్ బాస్కో ఫీడర్ పరిధిలో మైకేల్ కాలనీ, వివేకానగర్, డీడీ కాలనీ, కాళీమందిర్, ఎన్ఎఫ్‌సీ కాలనీ, ఆదర్శనగర్, ఎక్సైజ్ అకాడమీ, అభ్యుదయనగర్, అరుణోదయనగర్, సంధ్యానగర్, జీఆర్‌నగర్, మాచెన్‌పల్లి ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పుష్ప శ్రీనివాస్‌రెడ్డి

బండ్లగూడ: అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ పుష్ప శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. 16వ డివిజన్‌లోని భాగ్యనగర్ కాలనీలో రూ. 20 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... గడిచిన ఐదేళ్లల్లో 16వ డివిజన్‌లోని ప్రతి కాలనీలో డ్రైనేజీ, రోడ్డు నిర్మాణ పనులను యుద్ధప్రతిపాదికన చేపట్టామన్నారు. కాలనీ యువ నాయకుడు టింకురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీబీఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్


సువర్ణకుమారిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాల సీఎస్ఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.సువర్ణ కుమారికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. సహకార వడపోతలో నాణ్యతను పెంచే సెమాంటిక్ అప్రోచ్ అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను ఆమెకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా సువర్ణకుమారి మాట్లాడుతూ... వినియోగదారుల బ్రౌజింగ్ అనుభవాలను మెరుగు పరచటం, వ్యక్తిగతీకరించిన సమాచారాన్ని రెకమండేషన్ సిస్టమ్‌ల ద్వారా అందించటంపై తన ప్రయోగం దృష్టి సారించిందన్నారు. ఆమెకు డాక్టరేట్ రావటంతో సోమవారం కళాశాలలో ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు ఆమెను అభినందించారు.

బండ్లగూడ జాగీర్‌కు రూ. 96.73 కోట్లు

బండ్లగూడ: తెలంగాణ రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ వద్ద దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను సోమవారం చెల్లించింది. స్టాంపు డ్యూటీ, మోటేషన్ ఫీజులు గత 2019 సంవత్సరం నుంచి బకాయిలు పెండింగ్‌లో ఉండిపోవడంతో అవి మొత్తం రూ. 96.73 కోట్లకు చేరింది. రిజిస్ట్రేషన్ శాఖ వద్ద పేరుకుపోయిన స్టాప్ డ్యూటీ పూర్తిస్థాయి బకాయిలను ప్రభుత్వం విడుదల చేయడంతో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ. 96.73 కోట్లు నిధులు వచ్చాయి.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్‌ఎస్ పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి. కార్పొరేషన్ అధ్యక్షుడు రావులకోళ్ల నాగరాజు ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జీ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ గంగాని రవికుమార్, గంగపాక మహేందర్, బాబురావు, శ్వేత, స్వరూప, భాగ్యలక్ష్మి, జ్యోతి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి బీఆర్‌ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఏడాదిగా ప్రజలకు చేసిందేమీ లేనది ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆరు గ్యారంటీలు హామీల అమలకు పెద్ద ఎత్తున పోరాటం చేయనున్నట్లు తెలిపారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బీఆర్‌ఎస్ పార్టీని బలోపేతం చేస్తూ కంచుకోటగా మారుస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి